క్లుప్తంగా

జెడ్పీ చైర్‌పర్సన్ శ్రీరామనవమి శుభాకాంక్షలు



గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీరామనవమి పురస్కరించుకుని ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజలకు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా శుభాకాంక్షలు తెలియజేశారు. వాడవాడలా శ్రీరామనవమి ఉత్సవాల్ని ఘనంగా నిర్వహించి, సీతారాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ప్రజల్లో ఆధ్యాత్మిక, భక్తిభావం వెల్లివిరియాలని, తద్వారా సీఎం వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ రాజ్య పరిపాలనలో ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని భగవంతుడిని కోరారు.

పోషణ ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



నెహ్రూనగర్: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చని డెప్యూటీ మేయర్ షేక్ సజీల పేర్కొన్నారు. పొన్నూరు రోడ్డులో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు సక్రమంగా తీసుకుని, ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సంకూరి శ్రీను, ఖాజా మొహిద్దీన్ చిష్టి, సమత, సీడీపీఓ కృష్ణవేణి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు శ్రీరామ నవమి శోభాయాత్ర



పాత గుంటూరు: శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని గురువారం నగరంలో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు శ్రీ రామ ఉత్సవ కమిటీ సభ్యుడు చల్లా బ్రహ్మరెడ్డి తెలిపారు. బుధవారం బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి శోభాయాత్ర ప్రారంభమై నగరంలోని ప్రధాన వీధుల్లో కొనసాగి మల్లారెడ్డి నగర్‌లోని అయ్యప్ప స్వామి గుడి వద్ద ముగుస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో శ్రీరామ ఉత్సవ కమిటీ సభ్యులు చల్లా బ్రహ్మరెడ్డి, అడపా ఫణీంద్ర, తియ్యా వేణుగోపాల్, కారంశెట్టి లోకేష్, రాష్ట్ర నాయకులు వెంకటేష్, పవన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు, హోమాలు



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో వసంత నవరాత్రుల సందర్భంగా బుధవారం పలు పూజలు, హోమాల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులు 13 మంది వేద పండితుల ఆధ్వర్యంలో శివునికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన, విఘ్నేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, మహాగణపతి, రుద్ర, చండీ హోమాలు నిర్వహించి అనంతరం పూర్ణాహుతి చేశారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌గా డాక్టర్ పద్మావతీదేవి సేవలు అభినందనీయం



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ పద్మావతీదేవి సేవలు అభినందనీయమని ఎనస్థీషియా వైద్య విభాగాధిపతి డాక్టర్ విష్ణు మహేష్ బాబు కొనియాడారు. ఈనెల 31న పద్మావతీదేవి పదవీ విరమణ సందర్భంగా బుధవారం ఆమె చాంబర్‌లో ఎనస్థీషియా విభాగానికి చెందిన పలువురు వైద్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.పి.పోలయ్య, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ కె.నాగభూషణం, శ్యామ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్వేత, డాక్టర్ స్వర్ణలత పాల్గొన్నారు.

నగరంలో ఆర్వోబీ, ఆర్‌యూబీల నిర్మాణానికి చర్యలు

నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణాలకు ఇతర శాఖల్ని సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. తన చాంబర్‌లో బుధవారం గుంటూరు రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజినీర్ కో– ఆర్డినేషన్ జె.వి. అనూష, ఆర్ అండ్ బీ ఎస్ఈ నిర్మల, అడిషనల్ ఎస్పీ (క్రైం) శ్రీనివాసరావు, సీఆర్‌డీఏ ఈఈ శ్రీనివాస్, నగరపాలక సంస్థ ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, ఇతర అధికారులతో నగరంలో ఆర్వోబీ, ఆర్‌యూబీల నిర్మాణం, ఇతర అంశాలపై సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో రోజురోజుకీ ట్రాఫిక్ రద్దీ పెరుగుతోందని, అందుకు తగిన విధంగా నగరపాలక సంస్థ కూడా రోడ్ల విస్తరణ చేపట్టినట్లు చెప్పారు. ట్రాఫిక్ రద్దీ తగ్గాలి అంటే రైల్వే లైన్ల వద్ద ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణం చేపట్టాలని తెలిపారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి సేతుబంధు పథకంలో శంకర్ విలాస్ ఆర్వోబీ, శ్యామల నగర్ ఆర్‌యూబీల నిర్మాణాలు చేయాలని ప్రతిపాదనలు పంపామని వెల్లడించారు. నెహ్రూనగర్, సంజీవయ్య నగర్, గడ్డిపాడు రైల్వే లైన్ వద్ద వచ్చే వారంలో సంబంధిత విభాగ ఇంజినీర్లు, అధికారులు సంయుక్త పర్యటనలు చేసి ట్రాఫిక్ ఫీజిబులిటి, స్థల సేకరణ, డ్రైనేజీ తదితర అంశాల్ని పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. నగరంలో డ్రైనేజీ వెళ్లే మొండిగేటు అవుట్ ఫాల్ డ్రెయిన్‌కు కూడా రైల్వే నుంచి త్వరలో సమగ్ర అనుమతులు వస్తాయని తెలిపారు. ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణాలకు డీపీఆర్‌లు నగరపాలక సంస్థ చేపడుతుందని చెప్పారు. గుంటూరు రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజినీర్ కో– ఆర్డినేషన్ అనూష మాట్లాడుతూ ఆర్వోబీ, ఆర్‌యూబీలకు సంబంధించి సంపూర్ణ సహకారం తమ శాఖ నుంచి అందిస్తామని చెప్పారు. సంయుక్త పర్యటనలకు తమ ఇంజినీర్లు అందుబాటులో ఉంటారని, నగరపాలక సంస్థ నుంచి కొన్ని రైల్వే క్రాసింగ్ డ్రెయిన్లకు అందిన ప్రతిపాదనలు త్వరలో ఆమోదం అవుతాయని తెలిపారు. సమావేశంలో రైల్వే డెప్యూటీ సీఈ నోయల్, డివిజనల్ ఇంజినీర్ సుదర్శనరెడ్డి, నగరపాలక సంస్థ ఈఈలు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫార్మసీలో పీజీ అభ్యసించేందుకు పుష్కల అవకాశాలు

ఐర్లాండ్ దేశ ఉన్నత విద్యాశాఖ సలహాదారుడు



డేవిడ్ ఫల్లోన్‌ను సత్కరిస్తున్న జూపూడి రంగరాజు, నాగభూషణం, శ్రీనివాసరాజు, రవికుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: ఫార్మసీలో పీజీ అభ్యసించేందుకు ఐర్లాండ్‌లో పుష్కల అవకాశాలున్నాయని ఆ దేశపు ఉన్నత విద్యాశాఖ సలహాదారుడు డేవిడ్ ఫల్లోన్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో బుధవారం ఐర్లాండ్‌లో ఔషధ రంగంలో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న డేవిడ్ ఫల్లోన్ మాట్లాడుతూ ఐర్లాండ్‌లో ఫార్మసీ ఉన్నత విద్యను నిర్వహిస్తున్న యూనివర్సిటీల వివరాలతో పాటు అందుబాటులో ఉన్న స్పెషలైజేషన్ కోర్సులు, పీజీ కోర్సుల్లో చేరేందుకు అర్హతలు, వీసా నిబంధనలు, ఫార్మా సంస్థల్లో ఉపాధి అవకాశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఐ–20 ఫీవర్ మేనేజర్ బి. శ్రీనివాసరాజు మాట్లాడుతూ పీజీ కోర్సులకు వివిధ యూనివర్సిటీలో అమల్లో ఉన్న ట్యూషన్ ఫీజుల వివరాల్ని తెలియజేశారు. అనంతరం అతిథుల్ని కళాశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రవికుమార్, ఫార్మా డీ డైరెక్టర్ పి. సీతారామయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడూ పని చేయనున్న నగరపాలక సంస్థ క్యాష్ కౌంటర్లు

నెహ్రూనగర్: ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీకి 31 వరకే గడువు ఉన్నందున పన్ను చెల్లింపుదార్లకు వీలుగా గురువారం శ్రీరామనవమి సెలవు రోజు అయినప్పటికీ నగరపాలక సంస్థ క్యాష్ కౌంటర్లు యథావిధిగానే పని చేస్తాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 31న పన్ను చెల్లింపునకు ఏకకాలంలో ఎక్కువ మంది వస్తే సర్వర్ సమస్య ఏర్పడే అవకాశం ఉన్నందున, ముందుగానే పన్ను చెల్లించాలని ఆమె కోరారు. పన్ను చెల్లింపుదార్లకు వీలుగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లోని క్యాష్ కౌంటర్లతో పాటు భారత్‌పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్డులోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్డులోని 148 వార్డు సచివాలయాల్లో క్యాష్ కౌంటర్లు ఉదయం 8 నుంచి సాయంత్రం 8 గంటల వరకు పని చేస్తాయని పేర్కొన్నారు. ఈ నెల 31లోపు పన్ను చెల్లించని పక్షంలో ఏప్రిల్ 1 నుంచి పన్నుతో కలిపి చెల్లించాల్సి వస్తుందని తెలిపారు.

నేడు 'చలో శృంగ వృక్షం'

నెహ్రూనగర్: కాకినాడ జిల్లా తొండంగి మండలం శృంగవృక్షం గ్రామంలో కొద్ది రోజుల కిందట దళిత యువకుడు రాముపై దాడి, ఆపై హత్యను నిరసిస్తూ మాల జేఏసీ సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం చలో శృంగవరం కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు మాలమహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్‌కుమార్ తెలిపారు. ఆర్ అండ్ బీ బంగళాలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాము కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ, వారికి బాసటగా నిలిచేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. సమావేశంలో సంఘ నాయకులు గోదా జాన్‌పాల్, శ్రీలం రోషన్‌బాబు, బండ్లమూడి స్టాలిన్‌బాబు, దారా హేమప్రసాద్, శామ్యూల్, వెంకట్రావ్, నల్లపు నీలాంబరం, బత్తుల వీరాస్వామి, జొన్నలగడ్డ శ్రీకాంత్ పాల్గొన్నారు.

జిల్లా జైలుకు పంపు సెట్టు బహూకరణ



పంపు సెట్టును బహూకరిస్తున్న సంస్థ ప్రతినిధులు

గుంటూరు లీగల్: జిల్లా జైలులో మెరుగైన నీటి సరఫరా అందించేందుకు సహృదయ ఫౌండేషన్, సుబంధ ఫౌండేషన్ (యూఎస్ఏ)లు సుమారు రూ. 67 వేలు విలువగల రెండు హెచ్.పి. మోటార్ సబ్ మెర్సిబుల్ పంపు సెట్టును, ఇతర సామగ్రిని జిల్లా జైలుకు బుధవారం బహూకరించారు. జైళ్ల శాఖ గుంటూరు రేంజి డీఐజీ డాక్టర్ ఎం.వరప్రసాద్ సమక్షంలో కారాగార ఆవరణలో జైలు పర్యవేక్షణాధికారికి వీటిని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా జైలు పర్యవేక్షణాధికారి కె.రఘు మాట్లాడుతూ కూరగాయల పెంపకం, పచ్చదనాన్ని పెంపొందించేందుకు, ఖైదీలకు నీటి సరఫరా చేసేందుకు ఈ పంపుసెట్టును వినియోగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, జిల్లా జైలు జైలర్లు బి.తేజేశ్వరరావు, సీహెచ్ కిరణ్, డిప్యూటీ జైలర్లు టి.వెంకటరత్నం, ఏ.కళ్యాణ్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో సందడిగా కైజెన్–2కే23



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ మీట్ 'కైజెన్–2కే23' వేడుకల్ని బుధవారం సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విజ్ఞాన్ వీసీ పి.నాగభూషణ్ మాట్లాడుతూ విద్యార్థులందరూ ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా ఎదగగలిగితే పది మందికి ఉపాధి కల్పించే అవకాశం లభిస్తుందని చెప్పారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాల్ని పెంపొందించుకోవాలని సూచించారు. కొత్తగా, సృజనాత్మకంగా ప్రయత్నిస్తే ప్రస్తుత పోటీ ప్రపంచంలో విజయం సొంతమవుతుందని తెలిపారు. కైజెన్–2కే23ను పురస్కరించుకుని పలు అంశాల్లో పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతుల్ని అందజేశారు. కార్యక్రమంలో డీన్లు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవాళికి ఆదర్శం రామాయణం



జ్యోతి ప్రజ్వలనలో ఉమామహేశ్వరరావు, నాగేశ్వరరావు తదితరులు

పాత గుంటూరు: రామాయణ మహాకావ్యం మనవాళి జీవితానికి ఆదర్శవంతమైనదని ప్రముఖ సాహితీవేత్త లంకా విజయసారథి తెలిపారు. బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై బుధవారం రామాయణంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. లంకా విజయసారథి మాట్లాడుతూ రామాయణం కేవలం పురాణపరమే కాకుండా అనేక సామాజిక అంశాలతో కూడినదని వివరించారు. ఆలయ కమిటీ కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం



చల్లావారిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న సాంబశివరావు, రవిశేఖర్, సుధీర్‌బాబు, వలంటీర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: జీవితాన్ని నాశనం చేస్తున్న మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని చల్లావారిపాలెం గ్రామ సర్పంచ్ ఆరుదల సాంబశివరావు సూచించారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు రూరల్ చల్లావారిపాలెంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో భాగంగా మాదక ద్రవ్యాల నివారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ సాంబశివరావు మాట్లాడుతూ మత్తు పదార్థాలైన కొకైన్, గంజాయి వంటివి మనిషి విచక్షణను కోల్పోయేలా చేస్తాయని, తద్వారా ఎన్నో కష్టాలను చవిచూడాల్సి వస్తుందని తెలిపారు. ప్రధానంగా యువత వీటికి ఎక్కువగా బానిసలుగా మారుతున్నారని, ఇటువంటి ప్రమాదకరమైన వ్యసనానికి దూరంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమాన్ని ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ రవిశేఖర్ సందర్శించారు. ఆయన వెంట డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, గ్రామ సచివాలయ కార్యదర్శి కె.లక్ష్మి, వీఆర్వో లూర్దు రాజు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఉన్నారు.

రైల్వే కార్మికులు, లారీ డ్రైవర్లకు వైద్య పరీక్షలు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న హనుమంతరావు

లక్ష్మీపురం: కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైల్వే కార్మికులు, లారీ డ్రైవర్ల కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని రెడ్డిపాలెం గూడ్స్ షెడ్ సూపర్‌వైజర్ హనుమంతరావు అన్నారు. రెడ్డిపాలెంలోని గూడ్స్ షెడ్‌లో బుధవారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ శిబిరంలో 150 మందికి రక్త, మధుమేహం పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోరమండల్ రీజనల్ లాజిస్టిక్ మేనేజర్ ప్రదీప్‌కుమార్, జోనల్ మార్కెటింగ్ మేనేజర్ హరిబాబు, సీనియర్ అగ్రనామిస్ట్ స్వరూప్, మార్కెటింగ్ అధికారి తిరుపతిరావు పాల్గొన్నారు.

స్తంభాలపై కేబుళ్ల తొలగింపు పునరావృతం కారాదు : జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాజకుమారి

గుంటూరు వెస్ట్: విద్యుత్ స్తంభాలపై కేబుల్, ఇంటర్నెట్ వైర్లు తొలగింపు సంఘటన పునరావృతం కాకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అధికారుల్ని ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో బుధవారం విద్యుత్ శాఖ అధికారులు, కేబుల్ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ కొన్ని రోజులుగా కేబుల్ వైర్లు కట్ చేస్తున్నారని వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని, దీనిపై ప్రత్యేక కమిటీని నియమిస్తామని చెప్పారు. చట్టంతో పాటు ప్రభుత్వ విధి విధానాలను అధ్యయనం చేసి, బృందం చేసే సిఫార్సుల్ని బట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా సమాజంలో అలజడి సృష్టించే చర్యల్ని ఉపేక్షించమని చెప్పారు. కేబుల్ వైర్లు అక్రమంగా తొలగించిన అంశాన్ని ఆపరేటర్లు జేసీ దృష్టికి తీసుకురాగా దీనిపై విచారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ మురళీకృష్ణ యాదవ్, గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, ఏపీ జర్నలిస్ట్ యూనియన్ కేబుల్ ఆపరేటర్ల డివిజన్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నపరెడ్డి విజయ భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

ఎల్ఐసీ రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా



కొరిటెపాడు: పెన్షన్ స్థిరీకరణ, కుటుంబ పెన్షన్ పెంపుదల, నూతన పెన్షన్ స్కీం రద్దు, అందరికీ పాత పెన్షన్ స్కీం అమలు వంటి తమ డిమాండ్లను వెంటనే ఆమోదించాలని కోరుతూ బుధవారం అరండల్‌పేటలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద రిటైర్డ్ ఉద్యోగులు ధర్నా చేపట్టారు. కార్యక్రమానికి ఎస్.బంగారుబాబు అధ్యక్షత వహించారు. న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన జాతీయ స్థాయి ధర్నాకు మద్దతుగా కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ డివిజన్ కార్యదర్శి కె.ఎల్.ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఐదు సంవత్సరాల కొకసారి ఉద్యోగులకు జరిగే వేతన సవరణ మాదిరిగా పెన్షన్‌ను స్థిరీకరించాలని కోరారు. ఫ్యామిలీ పెన్షన్‌ను 30 శాతం పెంచుతూ మేనేజ్‌మెంట్ పంపిన ఫైల్‌ను కేంద్ర ఆర్థిక శాఖ వెంటనే ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. ఎల్ఐసీలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసీని బలహీన పరిచే విధానాలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని కోరారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ మంచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి వి.వి.కె. సురేష్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టి.జనార్దనరావు, బి.వి.ఎస్.హనుమంతరావు, టి.సాయిబాబు, టి.సంపత్‌కుమార్, కె.సీతారమేష్, సీహెచ్.అన్నామణి, టి.సరోజిని, కె.స్వరూపరాణి, సీహెచ్.వెంకట్రావు, కె.జె.ఎస్.విజయ్‌కుమార్, పి.ప్రభాకరరావు, ఎం.మురళీకృష్ణ పాల్గొన్నారు.

గ్లోబల్ లీడర్స్‌గా నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ విద్యార్థులు



ప్రవీణ్‌ను సత్కరిస్తున్న శ్రీకాంత్‌బాబు, శ్రీవిద్య, ఆనంద్

గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ స్థాయి ఆధునిక విద్యా బోధన, నాయకత్వ లక్షణాలను అలవర్చడం ద్వారా విద్యార్థుల్ని గ్లోబల్ లీడర్స్‌గా తీర్చిదిద్దుతున్నామని నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కె. శ్రీకాంత్ బాబు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో బుధవారం లివ్ లైఫ్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఏడు అంశాలలో 'లీడర్ ఇన్ మీ' పేరుతో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ భారతదేశ ప్రతినిధి, శిక్షకులు ప్రవీణ్ మాట్లాడుతూ తమ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా 150 దేశాల్లో పదివేలకు పైగా పాఠశాలల్లో లక్షలాది మంది విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. నైతిక విలువలతో కూడిన జీవన శైలి నేర్పడం ద్వారా విద్యార్థులు తమ మాతృదేశాన్ని, సమాజాన్ని ప్రేమిస్తూనే ప్రపంచ నాయకులుగా ఎదిగేలా శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేశ సంస్కృతి, సంప్రదాయాలు చాటుతూ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల చీఫ్ లెర్నింగ్ ఆఫీసర్ డాక్టర్ కె.శ్రీవిద్య, జనరల్ మేనేజర్ ఆనంద్, ప్రిన్సిపాల్ సుధీర్‌కృష్ణన్, అరవింద, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి

గుంటూరు ఈస్ట్: మహిళపై దాడి చేసి గాయపరిచిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బృందావన్ గార్డెన్స్ మూడో లైనులోని పూలషాపులో పూలు విక్రయిస్తున్న షేక్ బీబీ రహీమాను బుధవారం షంషీర్ బెదిరించి డబ్బులు తీసుకునేందుకు యత్నించాడు. రహీమా అడ్డుకుంది. షాపు యజమాని సోదరుడు అయిన తనను అడ్డుకుంటావా అంటూ షంషీర్ కత్తెరతో ఆమెపై దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ల్యాప్ టాప్ చోరీ

ల్యాప్ టాప్ చోరీపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజమండ్రికి చెందిన మనోజ్ గుంటూరులో సీఏ చదువుతూ బ్రాడీపేటలోని ఓ రూంలో ఉంటున్నాడు. మంగళవారం తలుపు వేసి నిద్రించాడు. గుర్తు తెలియని వ్యక్తి లోపలకు వచ్చి ల్యాప్‌ట్యాప్ చోరీ చేశాడు.

• రాములోరి కల్యాణానికి సిద్ధం



అలంకరణలో పాత గుంటూరు శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం



పాత గుంటూరు శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో షామియానా ఏర్పాటు



అలంకరణలో బ్రాడీపేట శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయం

శ్రీ రామ నవమి వేడుకలకు నగరంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. షామియాలు, పూలదండలు, విద్యుత్ దీప కాంతులతో ఆలయాలను సుందరంగా అలంకరించారు.

– పాత గుంటూరు



పార్క్ సెంటర్‌లోని కొత్త రాములవారి దేవాలయం

వైభవంగా శ్రీరామనవమి వేడుకలు



కొరిటెపాడు రామాలయంలో వేడుకలు

పాత గుంటూరు: కొరిటెపాడు గాంధీ బొమ్మ సెంటర్‌లోని శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామనవమి కల్యాణ మహోత్సవ వేడుకలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, మూలవిరాట్టుకు పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకాల్ని వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తుల విశేష సంఖ్యలో పాల్గొని, స్వామిని సేవించి తరించారు. కార్యక్రమాల్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు కొమ్మినేని శివ కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కిలారి ఆదినారాయణ, కార్యదర్శి కొమ్మినేని ప్రసాద్, సభ్యులు కొమ్మినేని కోటేశ్వరరావు, కె.నాగేశ్వరరావు, పి.శ్రీనివాస్ పర్యవేక్షించారు.

కమనీయంగా శ్రీ విశ్వేశ్వరస్వామి కల్యాణం



పాత గుంటూరు: బ్రాడీపేట రెండో లైనులోని శ్రీ గౌరీ విశ్వేశ్వరాలయంలో స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా బుధవారం కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో సీతారామాంజనేయులు, నర్సిరెడ్డి, ఆలయ అర్చకులు జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్‌శర్మ, మల్లి పాల్గొన్నారు.

భవనం పైనుంచి పడి యువకుడి దుర్మరణం

పీఎం పాలెం (విశాఖపట్టణం) : పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు భవనం నాలుగో అంతస్తు నుంచి కింద పడడంతో దుర్మరణం చెందాడు. ఎస్ఐ వెంకటరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు ప్రాంతానికి చెందిన రిచర్డ్స్ (29), అభిషేక్, మరో యువకుడు కలసి జీవీఎంసీ ఆరో వార్డు పరిధి కొమ్మాది సినిమా హాలు వెనక గల అపార్టుమెంటు నాలుగో అంతస్తులోని ఫ్లాట్‌లో నివసిస్తున్నారు. రిచర్డ్స్ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. మంగళవారం రిచర్డ్స్‌తో పాటు అభిషేక్ మాత్రమే ఫ్లాట్‌లో ఉన్నారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో అపార్టుమెంటు పైనుంచి కిందకు పడటంతో తీవ్రంగా గాయపడిన రిచర్డ్స్ మరణించాడు.